సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం। 20। నవంబర్। 2024



కిలో టమాట రూ.30
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.30, కనిష్టంగా రూ.16 ప్రకారం ధర పలికింది.



చీనీ టన్ను రూ.37,160
చీనీ ధర కాస్త పెరిగింది. అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.37,160 పలికాయి.

గరిష్ఠం/కనిష్ఠం
33.4°/18.1°
జిల్లా పరిధిలో మంగళవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఖాద్రీశుని హుండీ ఆదాయం రూ.87.14 లక్షలు



నగదును లెక్కిస్తున్న ఆలయ, బ్యాంకు సిబ్బంది

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి హుండీల ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించినట్లు ఆలయ ఈఓ వెండిదండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 67 రోజులకు గాను రూ.87,14,129 నగదు, 57 గ్రాముల బంగారం, 352 గ్రాముల వెండి లభించిందన్నారు. అలాగే 606 అమెరికా డాలర్లు, 300 అరబ్ డాలర్లు, 20 కెనడా డాలర్లు హుండీ ద్వారా స్వామివారికి భక్తులు సమర్పించినట్లు వెల్లడించారు. గతంతో పోలిస్తే ఈసారి ఆదాయం ఎక్కువ వచ్చినట్లు ఈఓ తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో హుండీల లెక్కింపు పర్యవేక్షణాధికారి సి.రవీంద్రరాజు, కెనరా బ్యాంక్ మేనేజర్ అనంతబాబు, ఆలయ సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచాలి

- డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్



మాట్లాడుతున్న విజయేంద్రప్రసాద్

నల్లచెరువు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య మరింత పెంచాలని డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ ఆదేశించారు. మంగళవారం ఆయన ఏపీడీ రమేష్ బాబు, ఎంపీడీఓ రఘునాథ గుప్తాతో కలిసి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ మాట్లాడుతూ, జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. మండలంలో రోజూ 2,200 మందికి పనులు కల్పించాలన్నారు. 'ఉపాధి'కి డ్రైల్యాండ్ హార్టికల్చర్ అనుసంధానం చేసిన నేపథ్యంలో రైతులకు అవగాహన కల్పించి హార్టికల్చర్ ప్లాంటేషన్ మొక్కలను పూర్తి స్థాయిలో నాటించాలన్నారు. సమావేశంలో ఏపీఓ మంజుల, ఈసీ బాలు నాయక్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

అమరనాథ్‌రెడ్డిపై మరో కేసు



అమరనాథ్‌రెడ్డి ఇంటికి నోటీసులు అతికిస్తున్న పెదనందిపాడు పోలీసులు

కదిరి అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండల కన్వీనర్ మలక అమరనాథ్‌రెడ్డిపై మరో కేసు నమోదైంది. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై సామాజిక మాధ్యమాల్లో ప్రశ్నించిన పాపానికి ఇప్పటికే అమరనాథ్‌రెడ్డిపై ఐదు కేసులు నమోదయ్యాయి. తాజాగా గుంటూరు జిల్లా పెదనందిపాడు పోలీసులు కూడా ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ మేరకు మంగళవారం పెదనందిపాడు పోలీసులు అమరనాథ్‌రెడ్డి స్వగ్రామం కదిరి మండలంలోని వీరచిన్నయ్యగారిపల్లికి వచ్చారు. అయితే అమరనాథ్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో ఆయన ఇంటికి నోటీసులు అతికించి వెళ్లారు. కాగా, అమరనాథ్‌రెడ్డి ఇంటికి రోజూ ఏదో ఒక జిల్లా నుంచి పోలీసులు వస్తున్నారు. తమ స్టేషన్‌లో కేసు నమోదైందని, విచారణకు రావాలని చెబుతున్నారు. దీంతో అమరనాథ్‌రెడ్డి తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు.

వీసీల నియామకం.. మరింత ఆలస్యం!

అనంతపురం: జేఎన్‌టీయూ, ఎస్కేయూలకు కొత్త వీసీల నియామక ప్రక్రియలో మరింత జాప్యం జరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మంగళవారం జేఎన్‌టీయూ పాలకమండలి సమావేశం జరగ్గా.. 'వీసీ సెర్చ్ కమిటీ'లో వర్సిటీ నామినీకి సంబంధించిన అంశం ప్రస్తావించకపోవడం గమనార్హం. వాస్తవానికి నామినీ ఎంపికే ప్రధాన అంశంగా సమావేశం నిర్వహించినప్పటికీ ఆ విషయం కనీసం చర్చకు కూడా రాలేదు. దీంతో జేఎన్‌టీయూ వీసీ నియామకం మరింత ఆలస్యం కానుంది. ఇక.. బుధవారం జరిగే ఎస్కేయూ పాలకమండలి సమావేశంలోనూ ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, రెండు వర్సిటీల పాలకమండలి సమావేశాలూ మంగళవారం జరగాల్సి ఉన్నప్పటికీ ఎస్కేయూలో జమున అనే ఉద్యోగి మరణించడంతో మంగళవారం సెలవు ప్రకటించారు. దీంతో పాలక మండలి సమావేశం బుధవారం జరగనుంది.

కన్నీళ్లు మిగిల్చిన ఖరీఫ్



పుట్టపర్తి మండలం ఇరగరాజుపల్లికి చెందిన రమణ ఈ ఏడాది ఖరీఫ్‌లో 4 ఎకరాల పొలంలో వేరుశనగతో పాటు కంది సాగుచేశాడు. విత్తనాలకు రూ.22 వేలు, సాగుకు రూ.18 వేలు, ఎరువులకు రూ.8 వేలు, కలుపు తొలగించేందుకు రూ.12 వేలతో పాటు మందులు పిచికారీ చేసినందుకు రూ.6 వేలు, పంటకోతకు రూ.16 వేలు, వేరుశనగ కాయలు విడిపించేందుకు మరో రూ.8 వేలు కలిపి మొత్తంగా రూ. 90 వేలు ఖర్చు చేశాడు. కానీ 4 ఎకరాల్లో పంట వేస్తే కేవలం 13 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. దీంతో కనీసం పెట్టుబడులు కూడా చేతికి అందలేదు. ఈసారి ఖరీఫ్‌లో వేరుశనగ సాగుచేసిన ప్రతి రైతుదీ ఇదే పరిస్థితి.

3,65,175 హెక్టార్లు
జిల్లాలో సాగుభూమి విస్తీర్ణం

2.05 లక్షల హెక్టార్లు
వేరుశనగ సాగు విస్తీర్ణం

1,62,800 హెక్టార్లు
ఖరీఫ్‌లో సాగైన పంట

1,332 హెక్టార్లు
వర్షానికి దెబ్బతిన్న పంట

3 బస్తాలు
ఎకరాకు వచ్చిన దిగుబడి

3 ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాలు

అతివృష్టి, అనావృష్టితో తీవ్రంగా దెబ్బతిన్న పంటలు

- ప్రధాన పంట వేరుశనగ దిగుబడి ఎకరాకు 3 బస్తాలే
- పెట్టుబడులు కూడా రాలేదంటున్న రైతన్నలు
- మూడు మండలాలకే కరువు జాబితాలో చోటు
- జిల్లా రైతులను పూర్తిగా విస్మరించిన కూటమి సర్కార్
- ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటున్న అన్నదాతలు



కదిరి: వర్షాధార పంటగా ఈఖరీఫ్‌లో సాగుచేసిన ప్రధాన పంట వేరుశనగ రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. ఓ వైపు అతివృష్టి... మరోవైపు అనావృష్టి కారణంగా వేరుశనగ సాగుచేసిన రైతన్నలు నిండా మునిగిపోయారు. లాభం సంగతి దేవుడెరుగు..కనీసం పెట్టుబడులు కూడా చేతికి దక్కలేదు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయాధికారులు నిర్వహించిన పంటకోత ప్రయోగాల్లో దిగుబడి బాగా తగ్గినట్లు తేలింది.5X5 విస్తీర్ణంలో పంట తీయగా కేవలం 1.50 కిలోలు మాత్రమే దిగుబడి వచ్చింది. ఈ లెక్కన ఎకరాకు కేవలం 3 నుంచి 4 బస్తాల లోపే దిగుబడులు వచ్చాయని అధికారులు చెబుతున్నారు.

రెక్కలకష్టం నీటిపాలు

జిల్లాలో 3,65,175 హెక్టార్ల సాగుభూమి ఉండగా అందులో ప్రధాన పంట వేరుశనగ సాగువిస్తీర్ణం 2.05 లక్షల హెకార్లుగా ఉంది. ఇందులో ఈసారి ఖరీఫ్‌లో 70 వేల ఎకరాల్లో వేరుశనగ, 16 వేల ఎకరాల్లో కంది, 7 వేల ఎకరాల్లో మొక్కజొన్న ఇంకా అన్ని రకాల పంటలు కలిపి మొత్తం 1,62,800 హెక్టార్లు సాగులోకి వచ్చాయి. అయితే వేరుశనగ పంట పూత దశలో ఉన్నప్పుడు వర్షం కురవలేదు. ఎలాగోలా రైతులు కాపాడుకున్నా... ఆ తర్వాత పంటచేతికొచ్చే సమయంలో వరుస తుపాన్లు కారణంగా పంట మొత్తం పొలంలోనే తడిసి ముద్దయ్యింది. దీంతో రైతుల రెక్కల కష్టం నీటిపాలైంది. అతివృష్టి కారణంగా జిల్లా వ్యాప్తంగా 1,332 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని అధికారులు ప్రభుత్వానికి పంపిన నివేదికల్లో వెల్లడించారు. ఖరీఫ్‌లో పంట నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని అన్నదాతలు వాపోతున్నారు.

కరువు మండలాల ప్రకటనలోనూ అన్యాయమే

జిల్లాలోని అన్ని మండలాల్లోనూ కరువు తాండవించింది. అయితే కూటమి ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కరువు మండలాల జాబితాలో జిల్లా ముదిగుబ్బ, తలుపుల, తాడిమర్రి మండలాలను మాత్రమే చోటు దక్కింది. ఒక మోస్తారు కరువు మండలాలుగా కనగానపల్లి, ధర్మవరం, గాండ్లపెంట, ఎన్‌పీ కుంట, పరిగి, రామగిరి, బుక్కపట్నం మండలాలను మాత్రమే ప్రభుత్వం గుర్తించింది. మిగిలిన 22 మండలాలను ప్రభుత్వం కరువు జాబితాలో చేర్చకపోవడంపై రైతులు ఆగ్రహంతో ఉన్నారు. దీన్నిబట్టి చూస్తే జిల్లా రైతాంగం సంక్షేమంపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

గతంలో అన్నదాతకు ఆర్థిక భరోసా

ఖరీఫ్ సీజన్‌లో విత్తనాల కొనుగోలుతో పాటు సాగుకు ఇబ్బంది పడకుండా గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సాగుకు ముందే రైతులకు పెట్టుబడి సాయం అందించేది. ఇందులో కేంద్రం 'ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా ఇచ్చే రూ.6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం వాటాగా మరో రూ. 7,500 కలిపి మొత్తంగా 13,500 'వైఎస్సార్ రైతు భరోసా' పేరుతో ఏటా నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తూ వచ్చింది. జిల్లాలో 2,92,170 మంది రైతులుండగా వీరిలో 2,79,556 మంది రైతులకు గత ఐదేళ్లలో వైఎస్సార్ రైతు భరోసా ద్వారానే రూ.1,767.09 కోట్ల లబ్ధి చేకూరింది. అది కూడా ఏటా మూడు విడతల్లోనూ చెప్పిన సమయానికి సకాలంలో గత ప్రభుత్వం జమ చేసింది. కానీ కూటమి ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని 'అన్నదాత సుఖీభవ' అని పేరు మార్చిందే తప్ప... ఇంతవరకూ రైతుల ఖాతాల్లో ఒక్క రూపాయి కూడా జమచేయలేదు.

అప్పులే మిగిలాయి



నేను 4 ఎకరాలు కౌలుకు తీసుకొని వేరుశనగ సాగు చేశాను. విత్తనాలతో పాటు అన్ని ఖర్చులు కలుపుకొని మొత్తంగా 1.50 లక్షలు ఖర్చు చేశాను. తీరా పంట చేతికొచ్చే సమయంలో వర్షానికి పంట పూర్తిగా తడిసిపోయింది. కాయలన్నీ మొలకలొచ్చాయి. కనీసం పెట్టుబడి కూడా రాలేదు. పంట కోసం చేసిన అప్పులకు వడ్డీ కూడా చెల్లించలేని పరిస్థితి.

–కొంకా గాంధీ, రైతు, బత్తలపల్లి

482 హెక్టార్లలో వేరుశనగ నష్టం



ఈ ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంట మొదట్లో వర్షం లేక కొంత ఎండిపోయింది. చివర్లో తుపాన్ల కారణంగా దెబ్బతినింది. అందుకే దిగుబడులు బాగా తగ్గాయి. తుపాను దెబ్బకు 482 హెక్టార్లలో వేరుశనగ, 540 హెక్టార్లలో వరి, 119 హెక్టార్లలో మొక్కజొన్న ఇలా వివిధ రకాల పంటలు మొత్తంగా 1,332 హెక్టార్లలో దెబ్బతిన్నాయి.

– డా.సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

పోస్టాఫీసు కిటకిట!

- ఎన్‌పీసీఐ లింక్ చేయించుకునేందుకు భారీగా వస్తున్న జనం



హిందూపురం హెడ్‌పోస్టాఫీసులో కిక్కిరిసిన జనం

హిందూపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వివిధ పథకాల లబ్ధి కలగాలంటే లబ్ధిదారులు తమ బ్యాంకు ఖాతాలు, ఆధార్‌ను ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఇండియా)తో లింక్ చేయించుకోవాలని అధికారులు చెబుతున్నారు. దీంతో జనమంతా బ్యాంకులకు పరుగులు తీస్తున్నారు. అయితే ఈ ప్రక్రియ ప్రహసనంగా మారడంతో కొందరు కొత్తగా అకౌంట్ ఓపెన్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో పోస్టాఫీసులో కేవలం రూ.200 మొత్తంతోనే సేవింగ్స్ అకౌంట్ ఓపెన్ చేయడంతో పాటు వెంటనే ఎన్‌పీసీఐకి లింక్ చేస్తున్నారు. దీంతో మంగళవారం హిందూపురం హెడ్‌పోస్టాఫీసు జనంతో కిటకిటలాడింది. ఎన్‌పీసీఐ లింక్ చేయించుకునేందుకు జనం బారులు తీరారు.

నేడు ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల కౌన్సెలింగ్

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం కార్పొరేషన్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీల పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల కౌన్సెలింగ్ బుధవారం నిర్వహించనున్నారు. ఇందుకోసం విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అనంతపురం కార్పొరేషన్ సంస్థ ఒక యూనిట్‌గా, తక్కిన ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీలు ఒక యూనిట్‌గా పదోన్నతులు చేపట్టనున్నారు. ఇప్పటికే తుది సీనియార్టీ జాబితాను విడుదల చేశారు. బుధవారం ఉదయం 11 గంటలకు డీఈఓ కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. సర్వీస్ రిజిస్టర్, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని డీఈఓ ప్రసాద్‌బాబు సూచించారు. సర్టిఫికెట్ల పరిశీలన తర్వాత మధ్యాహ్నం 3 గంటలకు పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించి ఆయా స్థానాలను భర్తీ చేయనున్నారు. ఈ కౌన్సెలింగ్‌లో మొత్తంగా 6 గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పోస్టులతో పాటు 7 ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లన్నీ ఇప్పటికే పూర్తి చేశారు.

మిర్చి ఎక్కువ.. ధర తక్కువ

- రూ.13 వేలలోపే పలుకుతున్న క్వింటా ఎండుమిర్చి



హిందూపురం మార్కెట్‌లో మిర్చి లావాదేవీలు

హిందూపురం అర్బన్: కాసులు కురిపించాల్సిన ఎండుమిర్చి రైతులకు కన్నీళ్లు మిగులుస్తోంది. మార్కెట్‌కు సరుకు ఎక్కువగా వస్తుండటం... కొనేవారు లేకపోవడంతో ధర అమాంతం పడిపోయింది. దీనికి తోడు విదేశాలకు ఎండుమిర్చి ఎక్స్‌పోర్టు లేకపోవడంతో రైతులు ఆశించినంత ధర కావడం లేదు.

వ్యాపారులు నిర్ణయించిందే ధర..

హిందూపురం మార్కెట్‌లో ఎండుమిర్చి కొనుగోళ్లు ఈ-నామ్ పద్ధతిలో సాగుతున్నా... చివరకు వ్యాపారులు నిర్ణయించిన ధరే ఖాయమవుతోంది. మార్కెట్‌లో మిర్చి కొనుగోలు చేసే వ్యాపారులు పదిమందే ఉండటంతో మార్కెట్‌కు ఎంత సరకు వచ్చినా వారే కొనుగోలు చేస్తున్నారు. దీంతో వారంతా సిండికేట్ అయ్యారు. పోటీ లేకపోవడంతో వారు నిర్ణయించిన రేటుకే ఎండుమిర్చి విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

క్వింటాపై రూ.4,500 తక్కువ

గత ఏడాది ఇదే సమయంలో క్వింటా ఎండుమిర్చి మొదటి రకం క్వింటా రూ.22 వేల వరకూ పలికింది. ఆసారి మాత్రం క్వింటా రూ.18,500 మించి పలకలేదు. మార్కెట్‌కు ఎండుమిర్చి ఎక్కువ రావడంతో ప్రస్తుతం క్వింటా రూ.11 వేల నుంచి రూ.13 వేలలోపే పలుకుతోంది. మంగళవారం హిందూపురం మార్కెట్‌కు 234 క్వింటాళ్ల ఎండు మిర్చి రాగా.. మొదటి రకం మిర్చి క్వింటా రూ.18,500, రెండో రకం రూ.9 వేలు, మూడవ రకం క్వింటా రూ.7 వేల ప్రకారం ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు.

స్వచ్ఛతపై అవగాహన కల్పించాలి

- ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు సరఫరా
- అధికారులతో కలెక్టర్ టీఎస్ చేతన్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: స్వచ్ఛతతో పాటు వ్యక్తిగత, సామాజిక మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. డిస్ట్రిక్ట్ వాటర్ శానిటేషన్ మిషన్ జిల్లా స్థాయి కమిటీ తొలి సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ ఇచ్చి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేస్తామన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా పారిశుధ్య కార్యక్రమాలు పక్కాగా అమలు జరిగేలా చూడాల్సిన బాధ్యత జిల్లా స్థాయి కమిటీదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు, వ్యక్తిగత, సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, వసతి గృహాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. జిల్లాకు 9,463 మరుగుదొడ్లు మంజూరయ్యాయన్నారు. డిసెంబర్ 5 నుంచి 9 వ తేదీ వరకు పరిశుభ్రమైన మరుగుదొడ్లను గుర్తించి అవార్డులు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎం.శంకరమ్మ, లక్ష్మీదేవి, సుకన్యకు మరుగుదొడ్ల మంజూరు లేఖలను కలెక్టర్ అందించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మల్లికార్జునప్ప, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ సమత, జలవనరుల శాఖ జిల్లా అధికారి విజయ్ కుమార్‌రెడ్డి, వ్యవసాయ అధికారి సుబ్బారావు, డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి, సీడీపీఓ గాయత్రి దేవి, టూరిజం అధికారి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

'సూర్యఘర్'కు ఐదు మోడల్ గ్రామాలు

సౌరశక్తిని వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి 'సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' పథకం అమలుకు జిల్లాలో ఐదు మోడల్ గ్రామాలను గుర్తించాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీఎల్‌సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 'సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' పథకం కింద ఇంటిపై సోలార్ ప్యానెళ్లు బిగించుకునే వారికి ప్రభుత్వం 40 శాతం వరకూ సబ్సిడీ ఇస్తుందన్నారు. పథకంపై విస్తృత అవగాహన కల్పించేందుకు ఓ కమిటీ వేస్తున్నామన్నారు. కమిటీ కన్వీనర్‌గా ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర వ్యవహరిస్తారన్నారు. డీఎల్సీ కమిటీలో డీఆర్‌డీఏ పీడీ, డీపీఓ, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లను సభ్యులుగా చేర్చుకోవాలని కన్వీనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో చురుకైన స్వయం సహాయక గ్రూప్‌లను గుర్తించి 'సూర్యఘర్'పై వారికి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ సమత, ఏపీ ఎస్పీడీసీఎల్ ఇంజినీర్లు మోషెస్, శివరామాంజినేయులు, చలపతి, అధికారులు కిషోర్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాయికీర్తనం.. భవిష్యత్ నిర్దేశనం

- ప్రశాంతి నిలయంలో ఘనంగా మహిళా దినోత్సవం
- ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నంద



సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటున్న జస్టిస్ సూరేపల్లి నంద

ప్రశాంతి నిలయం: అంతర్జాతీయ ఆధ్యాత్మిక ధామం ప్రశాంతి నిలయం సత్యసాయికీర్తనలతో ప్రతిధ్వనించింది. సత్యసాయిబాబా 99వ జయంత్యుత్సవాల సందర్భంగా మంగళవారం సాయికుల్వంత్ సభా మందిరంలో మహిళా దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థినుల వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈశ్వరమ్మ ఇంగ్లిష్ మీడియం, సత్యసాయి ప్రైమరీ, అనంతపురం మహిళా క్యాంపస్‌కు చెందిన విద్యార్థినులు పూర్ణ కలశాలు చేతబూని మేళతాళాలు, బ్రాస్ బ్యాండ్‌తో సత్యసాయి యజుర్ మందిరం నుంచి సాయికుల్వంత్ సభా మందిరంలోని సత్యసాయి మహాసమాధి వరకు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాలతో సత్యసాయిని కీర్తిస్తూ స్వరాలు పలికించారు. మృదు మధురమైన సంగీతంతో అందరినీ ఆకట్టుకున్నారు. సత్యసాయి అనంతపురం మహిళా క్యాంపస్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజేశ్వరి పాటిల్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు సతీమణి హిమవాహినితో కలిసి తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నంద జ్యోతి ప్రజ్వలను చేసి వేడుకలను ప్రారంభించారు. డాక్టర్ రాజేశ్వరి పాటిల్ ప్రారంభోపన్యాసం చేశారు.

భవిష్యత్ మహిళలదే

భవిష్యత్ అంతా మహిళల చేతుల్లోనే ఉంటుందని తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నంద అన్నారు. మహిళా దినోత్సవంలో ఆమె కీలక ఉపన్యాసం చేశారు. మహిళలకు భవిష్యత్‌ను నిర్దేశించారు. మహిళలు ఇప్పటికే కుటుంబం, సమాజం, జాతి నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని, పురుషులతో సమానంగా శాస్త్ర, సాంకేతిక రంగాల్లోనూ సత్తాచాటుతున్నారన్నారు. ప్రతి మహిళా తన సామర్థ్యాలపై నమ్మకంతో కష్టపడే తత్వాన్ని అలవర్చుకుని ఎంచుకున్న రంగంలో ముందుకు సాగితే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. మహిళా సాధికారతకు సత్యసాయి ఎంతో కృషి చేశారని కొనియాడారు. మహిళలలోని ఆదర్శాలను, శక్తియుక్తులను ప్రపంచానికి చాటేందుకు 1995 నవంబర్ 19 నుంచి తన జన్మదిన వేడుకలలో మహిళా దినోత్సవం నిర్వహిస్తూ వచ్చారని గుర్తు చేశారు. అలాగే సత్యసాయి సేవా సంస్థలలో ప్రత్యేకంగా మహిళా విభాగం ఏర్పాటు చేసి సామాజిక సేవా కార్యక్రమాలలో పురుషులతో సమాన అవకాశాలు కల్పించారన్నారు.



బ్రాస్‌బ్యాండ్ వాయిస్తున్న సత్యసాయి విద్యార్థినులు



మేళతాళాలతో సత్యసాయిని కీర్తిస్తున్న అనంతపురం క్యాంపస్ విద్యార్థినులు

క్లుప్తంగా

ఆర్టీసీ డ్రైవర్ల నిజాయితీ



సెక్యూరిటీ సమక్షంలో బ్యాగ్‌లు, వస్తువులు అందజేస్తున్న డ్రైవర్లు

పుట్టపర్తి టౌన్: బస్సులో ప్రయాణికుడు మరిచిపోయిన విలువైన వస్తువులున్న బ్యాగ్‌ను భద్రపరిచి తిరిగి సదరు ప్రయాణికుడికి అప్పగించి ఆర్టీటీ డ్రైవర్లు నిజాయితీ చాటుకున్నారు. వివరాలు... ఒంగోలు నుంచి సోమవారం సాయంత్రం పుట్టపర్తికి బయలుదేరిన బస్సు మంగళవారం ఉదయం స్థానిక డిపోకు చేరుకుంది. ప్రయాణికులందరూ దిగిపోయిన తర్వాత రెండు బ్యాగ్‌లను ప్రయాణికులు మరిచిపోయినట్లుగా డ్రైవర్లు ఎస్‌వీ నారాయణ, డీసీ శేఖర్ గుర్తించి, వాటిని భద్రంగా డిపో సెక్యూరిటీ కానిస్టేబుల్ సమక్షంలో డిపో క్లర్క్‌కు అందజేశారు. బ్యాగ్‌లో నాలుగు తులాల బంగారు ఆభరణాలు, బ్యాంక్ పాస్ బుక్‌లు, పాన్‌కార్డు, రెండు జతల దుస్తులు ఉన్నాయి. బ్యాంక్ పాస్‌బుక్కులో ఉన్న ఫోన్ నంబర్‌కు డిపో మేనేజర్ ఇనాయతుల్లా కాల్ చేసి మాట్లాడారు. తనది నెల్లూరు జిల్లా వాకాడ అని, తన పేరు సోమయ్యగా అవతలి వ్యక్తి తెలిపాడు. నెల్లూరులో బస్సు ఎక్కి మైదుకూరులో దిగానని, బుధవారం పుట్టపర్తికి వచ్చి తన బ్యాగ్, సొత్తు తీసుకుంటానని తెలిపాడు. ప్రయాణికుడు డిపోకు వచ్చిన తర్వాత అతని ఆధారాలు పరిశీలించి, వస్తువులు అందజేయనున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. నిజాయితీ చాటుకున్న డ్రైవర్లను అభినందించారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి

- పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్



మాట్లాడుతున్న ఆర్జేడీ శామ్యూల్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) శామ్యూల్ సూచించారు. అనంతపురం రూరల్ మండలం బళ్లారి రోడ్డులోని సీఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల నుంచి ఎంపిక చేసిన 239 మంది ఎంఈఓలు, హెచ్‌ఎంలకు జరుగుతున్న రెండో విడత 'లీడర్‌షిప్' శిక్షణ తరగతులను మంగళవారం ఆయన పరిశీలించారు. శిక్షణలో భాగంగా నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేయాలని ఎంఈఓలు, హెచ్‌ఎంలకు సూచించారు. ఎంఈఓలు, హెచ్‌ఎంలు సాధారణ ఉపాధ్యాయుల్లా కాకుండా ఓ నాయకుడిగా వ్యవహరించాలన్నారు. ఆర్జేడీ వెంట సెంటర్ ఇన్‌చార్జ్, ఎంఈఓ కృష్ణయ్య, ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఓ నాగరాజు ఉన్నారు.

తమలపాకు... తెగుళ్లతో షాక్

- రైతుల జీవనాధారాన్ని నమిలేస్తున్న తెగుళ్లు
- నాణ్యత లోపించడంతో పడిపోయిన ధరలు
- ఇబ్బందుల్లో అన్నదాతలు



అమరాపురం వద్ద ఏపుగా పెరిగిన తమలపాకు తోట



తెగుళ్లతో దెబ్బతిన్న తమలపాకు

అమరాపురం: మారిన వాతావరణ పరిస్థితులు తమలపాకు రైతులను తీవ్ర నష్టాలకు గురి చేస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎక్కడ లేని విధంగా అమరాపురం మండలంలో బోరు బావుల కింద వక్క, తమలపాకు తోటలను రైతులు సాగు చేశారు. గౌడనకుంట, తమ్మడేపల్లి, దేవగానపల్లి, నగోనపల్లి, వలస, విరుపసముద్రం, మద్దనకుంట, అమరాపురం, పుల్లికుంట, బంగారుపాళ్యం, హాలుకూరు, చిట్నదకు, ఉదుగూరు, కాచికుంట, కె.శివరం తదితర గ్రామాల్లో దాదాపు వెయ్యి ఎకరాలకు పైగా వక్క తోటల్లో అంతర పంటగా తమలపాకు సాగులో ఉంది. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తోడు వాతావరణంలో మార్పుల కారణంగా తమలపాకు పంటకు తెగుళ్లు సోకాయి. ఫలితంగా కోతకు వచ్చిన ఆకు మీద నల్లమచ్చ, పసుపుపచ్చ చుక్కలు ఏర్పడి ఆకులు నల్లబడి రాలి పోతున్నాయి.

పడిపోయిన ధరలు

నెల రోజుల క్రితం వంద ఆకుల కట్ట (పెండీ) రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు అమ్ముడపోయింది. ప్రస్తుతం తమలపాకు తోటలను తెగుళ్లు ఆశించడంతో మార్కెట్లో పెండీ ధర రూ.2 వేల నుంచి రూ.3.5 వేలకు మించి పలకడం లేదు. దీంతో కూలీల ఖర్చు కూడా గిట్టుబాటు కావడం లేదని రైతులు వాపోతున్నారు. కాగా, తమలపాకు తోటలను ఆశించిన తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చే వారు కరువయ్యారు. ఉద్యాన శాస్త్రవేత్తలు, అధికారులు సైతం అటుగా కన్నెత్తి చూడక పోవడంతో రైతుల వేదనకు అంతులేకుండా పోతోంది.

ఆకు రాలిపోతోంది



నాకు రెండున్నర ఎకరాల భూమి ఉండగా, అందులో రెండెకరాల వక్క తోటలో అంతర పంటగా తమలపాకు సాగు చేశాను. గతంలో 10 పెండీల వరకు దిగుబడి వచ్చింది. లాభాం కూడా అదే స్థాయిలో వచ్చింది. ప్రస్తుతం తెగుళ్లు ఆశించడంతో తమలపాకులు నల్లగా మారి ఎక్కడికక్కడ రాలిపోతున్నాయి. దిగుబడి కూడా పెద్దగా లేదు. చేతి నుంచి డబ్బు వేసుకుని కూలీలకు చెల్లించాల్సి వస్తోంది.

– హనుమంతరాయప్ప, రైతు, తమ్మడేపల్లి, అమరాపురం మండలం

రుచి లేవు



ఈ ప్రాంతంలో నేనే కాదు... చాలా మంది రోజూ నాలుగైదుసార్లు వక్క, సున్నంతో కలిపి తమళపాకులు తింటూ ఉంటారు. ఎంతో రుచిగా ఉంటుంది. అంతేకాక చాలా అనారోగ్య సమస్యలూ దూరమయ్యాయి. చెడు వ్యసనాల కంటే ఇది ఎంతో మేలు. అయితే నెల రోజులుగా తమలపాకు తోటలకు తెగుళ్లు ఆశించడంతో ఆకుల్లో నాణ్యత లోపించింది. దీంతో ఆకులు తిన్నప్పుడు రుచి లేకుండా పోతోంది. తినలేకపోతున్నాం.

– నాగేగౌడ, రైతు, దేవగానపల్లి, అమరాపురం మండలం

అధికారులు స్పందించాలి



నాకున్న తమలపాకు తోటతో పాటు కౌలుకు మరో రెండు ఎకరాల తోటలను తీసుకున్నా. గత ఏడాది నుంచి ఎలాంటి ఇబ్బంది కలగలేదు. ప్రస్తుతం చలి ప్రభావం పెరగడంతో తెగుళ్లు సోకి తీవ్రంగా నష్టపోతున్నా. దీంతో వచ్చిన కొద్దిపాటి ఆదాయం కూడా కూలీల ఖర్చులకు సరిపోవడం లేదు. అధికారులు స్పందించి తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించాలి.

– సత్యనారాయణ, రైతు, నగోనపల్లి, అమరాపురం మండలం

కురుబ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శివ



హిందూపురం: వైఎస్సార్‌సీపీ కురుబ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హిందూపురం మున్సిపల్ కౌన్సిలర్ శివ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ముగిసిన సంతోష్ ట్రోఫీ

అనంతపురం: సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీ లీగ్ దశ మంగళవారం ముగిసింది. అనంత క్రీడాగ్రామంలోని ఆర్డీటీ స్టేడియంలో ఈ నెల 15న ప్రారంభమైన మ్యాచ్‌ల్లో చివరి రోజు మంగళవారం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు జట్ల మధ్య జరిగిన పోరులో తమిళనాడు జట్టు ఏకంగా 8–0 గోల్స్ తేడాతో విజయాన్ని కైవసం చేసుకుంది. మరో మ్యాచ్‌లో అండమాన్ నికోబార్ జట్టుపై 11–0 గోల్స్ తేడాతో కర్ణాటక జట్టు విజయం సాధించింది. ఓవరాల్‌గా అత్యధిక పాయింట్లతో తమిళనాడు జట్టు ఫైనల్‌కు చేరింది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



సుధాకర్‌రెడ్డి (ఫైల్)

నల్లమాడ: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... నల్లమాడ మండలం కొండ్రవారిపల్లికి చెందిన ఎం.సుధాకరరెడ్డి (52)కి తండ్రి పెద్ద గంగిరెడ్డి, తల్లి వరలక్ష్మి. ఓ కుమారుడు ఉన్నారు. భార్య చాముండేశ్వరి పదేళ్ల క్రితమే మృతి చెందింది. తనకున్న 20 ఎకరాల పొలంలో కొన్నేళ్లుగా వేరుశనగ, ఇతర పంటలు సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టాలు చవిచూస్తూ వచ్చాడు. ఈ క్రమంలో మలి విడత పంటల సాగుకు చేసిన అప్పులకు ఏటా వడ్డీల భారం పెరుగుతూ వచ్చింది. వీటికి తోడు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న తల్లి వరలక్ష్మికి శస్త్ర చికిత్స చేయించేందుకు మరిన్ని అప్పులు చేశాడు. దీంతో అప్పులు సుమారు రూ.15 లక్షలకు చేరాయి. ఈ ఏడాది కూడా పంట సక్రమంగా పండక పోవడంతో అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచడం లేదంటూ కుటుంబసభ్యుల వద్ద తరచూ బాధపడేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం 6.30 గంటలకు క్రిమి సంహారక మందు తాగాడు. కాసేపటికే అపస్మారక స్థితికి చేరుకున్న సుధాకరరెడ్డిని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో కదిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సకు స్పందించక మంగళవారం తెల్లవారుజామున 5.40 గంటలకు మృతిచెందాడు. మృతుడి తండ్రి పెద్ద గంగిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ దాదాపీర్ తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్‌పై దాడి




పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న పార్వతమ్మ

పెనుకొండ రూరల్: మండలంలోని అమ్మవారిపల్లి గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ పార్వతమ్మపై అదే గ్రామానికి చెందిన రాజశేఖర్ సోమవారం రాత్రి దాడి చేశాడు. మద్యం మత్తులో ఆమెతో వాగ్వాదానికి దిగి ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశాడు. ఆ సమయంలో అడ్డుకోబోయిన పార్వతమ్మపై విచక్షణారహితంగా దాడిచేయడంతో ఆమె గాయపడింది. ఘటనపై కియా పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది.

వివాహిత ఆత్మహత్య

గుడిబండ: మండలంలోని కేకాతీ గ్రామానికి చెందిన వివాహిత శ్వేత(41) ఆత్మహత్య చేసుకుంది. భర్త విశ్వనాథ్ పెనుకొండలోని కియా పరిశ్రమలో పనిచేస్తున్నాడు. కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్న ఆమెకు కుటుంబసభ్యులు చికిత్స చేయించినా ఫలితం దక్కలేదు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె సోమవారం ఇంట్లోనే ఎలుకల మందు తాగింది. విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు హిందూపురం, ఆ తర్వాత అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్సకు స్పందించక మంగళవారం ఆమె మృతి చెందింది. మృతురాలి అన్న శ్రీనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ మునిప్రతాప్ తెలిపారు.

పట్టు రైతుల జిల్లా నూతన కమిటీ ఎన్నిక



పట్టురైతుల జిల్లా నూతన కమిటీ సభ్యులు

హిందూపురం: స్థానిక పట్టుగూళ్ల మార్కెట్‌లో పట్టు రైతుల సంఘం ఉమ్మడి జిల్లా నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా కె.సోముకుమార్, కార్యదర్శిగా సిద్ధారెడ్డి, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, ఎం.బసవరాజు రామకష్టారెడ్డి, సహాయ కార్యదర్శిగా రామకృష్ణారెడ్డి, కోశాధికారిగా కేఆర్ నవీన్‌తో పాటు సభ్యులుగా 25 మందిని ఎన్నుకున్నారు. ఈ ప్రకియను అనంతరం కమిటీ సభ్యులు సమావేశమై పలు అంశాలపై తీర్మానాలు చేశారు.

గంజాయి ముఠా అరెస్ట్



గంజాయి విక్రేతలను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

లేపాక్షి: గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు హిందూపురం రూరల్ సీఐ జనార్దన్, యుపీఎస్ సీఐ ఆంజనేయులు, లేపాక్షి, హిందూపురం ఎస్‌ఐలు నరేంద్ర, శ్రీధర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వారు వెల్లడించారు. అందిన ముందస్తు సమాచారంతో లేపాక్షి మండలం మల్లిరెడ్డిపల్లి గ్రామ శివారులో ఉన్న హెరిటేజ్ ఫుడ్స్ వద్ద మంగళవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో సీమజాలి చెట్ల వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఆరుగురిని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారిస్తే గంజాయి విక్రయిస్తున్నట్లుగా వెల్లడైంది. వారి నుంచి 1.80 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో సేవామందిర్‌కు చెందిన సయ్యద్ బర్కత్ అలి, హిందూపురం రైల్వేస్టేషన్ రోడ్డులోని బార్బర్ షాపులో పనిచేస్తున్న వంశీకృష్ణ, హిందూపురంలోని రహమత్‌పురానికి చెందిన కియా కార్ల కంపెనీ డ్రైవర్ ఉదయకిరణ్, లేపాక్షి మండలం పి.కొత్తపల్లికి చెందిన సయ్యద్ అమీర్, హిందూపురం మండలం మరువపల్లికి చెందిన పూరింటి తిమ్మప్ప, అహమ్మదనగర్ నివాసి సైపుల్లాఖాన్ ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

గంజాయి స్వాధీనం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని నక్కల గుట్ట కాలనీలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గురుకులాల్లో టీచరు పోస్టులకు దరఖాస్తులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని సాంఘిక సంక్షేమ (అంబేడ్కర్) గురుకులాల్లో ఖాళీగా ఉన్న టీచరు పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 21న ఉదయం 10 గంటలకు అనంతపురం రూరల్ మండలం కురుగుంట గురుకుల పాఠశాలలో జరిగే డెమోకు హాజరుకావాలని గురుకులాల సమన్వయ అధికారి ఉదయశ్రీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు. బాలికల పాఠశాలలకు మహిళలను మాత్రమే ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు.

ఖాళీల వివరాలు ఇలా...

తిమ్మాపురం బాలికల పాఠశాలలో టీజీటీ బీఎస్, పీజీటీ సోషల్, ఉరవకొండ బాలికల పాఠశాలలో జేఎల్ ఇంగ్లీష్, కురుగుంట బాలికల పాఠశాలలో జేఎల్ ఇంగ్లీష్, పీడీ, అమరాపురం బాలికల పాఠశాలలో టీజీటీ పీఎస్, టీజీటీ హిందీ, పీజీటీ ఇంగ్లీష్, గుత్తి బాలికల పాఠశాలలో జేఎల్ కెమిస్ట్రి, జేఎల్ ఇంగ్లీష్, హిందూపురం బాలుర పాఠశాలలో టీజీటీ పీఎస్, హిందూపురం బాలికల పాఠశాలలో టీజీటీ పీఎస్.

ఇవీ విద్యార్హతలు

జేఎల్ పోస్టులకు పీజీ, బీఈడీ, టెట్ క్వాలిఫై సర్టిఫికెట్, పీజీటీ పోస్టులకు పీజీ, బీఈడీ, టెట్ క్వాలిఫై సర్టిఫికెట్, టీజీటీ పోస్టులకు డిగ్రీ, బీఈడీ, టెట్ క్వాలిఫై సర్టిఫికెట్ (టీజీటీ హిందీకి డిగ్రీతో పాటు పీజీ ఉండాలి), పీఈటీ పోస్టులకు బీపీఎడ్, టెట్ క్వాలిఫై సర్టిఫికెట్ ఉండాలి.

యువకుడి బలవన్మరణం



మృతుడు నాగరాజు

హిందూపురం అర్బన్: స్థానిక ముక్కిడిపేటలో నివాసముంటున్న నాగరాజు(24) ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. అయినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న నాగరాజు మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

యువకుడి దుర్మరణం

ధర్మవరం అర్బన్: ఐచర్ వాహనం దూసుకెళ్లిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని యాదవ వీధిలో నివాసముంటున్న బేల్దారి గజేంద్ర(26) మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంపై తన అక్క ఇంటికి బయలుదేరాడు. దేవి నర్సింగ్ హోమ్ వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా ధర్మవరం నుంచి పుట్టపర్తికి వెళుతున్న ఐచర్ వాహనం వేగంగా ఢీకొట్టి కొంతదూరం ఈడ్చుకెళ్లింది. ఘటనలో గజేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐ నాగేంద్రప్రసాద్ అక్కడకు చేరుకుని వాహనం టైర్ల కింద ఇరుక్కున్న మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, మృతుడికి భార్య నందిని, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అలరించిన ప్రియా సిస్టర్స్ గానం



సంగీత కచేరి నిర్వహిస్తున్న ప్రియా సిస్టర్స్ బృందం

ప్రశాంతి నిలయం: సత్యసాయి 99వ జయంతి వేడుకల్లో భాగంగా మంగళవారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత ప్రియా సిస్టర్స్ నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను మైమరపించింది. అనంతరం ప్రియా సిస్టర్స్‌ను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

పెనుబోలులో 'తమ్ముళ్ల' భూ దందా

- ఆన్‌లైన్‌లో పేరు మార్చి..మొక్కలు నాటి
- రామగిరి మండలంలో 'పరిటాల' అండతో దౌర్జన్యకాండ
- మహిళా రైతు పొలాన్ని ఆక్రమించి మొక్కలు నాటిన వైనం
- అధికారం అండతో ఆన్‌లైన్‌లోనూ పేర్ల మార్పు
- లబోదిబోమంటున్న బాధిత రైతులు



రామగిరిమండలం పెనుబోలులో రైతు తేజస్విని పొలంలో మామిడి మొక్కలను నాటిన టీడీపీ నేతలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తెలుగు తమ్ముళ్ల అరాచకాలు, దౌర్జన్యాలకు అంతేలేకుండా పోయింది. ముఖ్యంగా పరిటాల సునీత ప్రాతినిధ్యం వహిస్తున్న రాప్తాడు నియోజకవర్గంలో అరాచకం మరింత ఎక్కువైంది. పరిటాల కుటుంబం అండ చూసుకుని ఆ పార్టీ నేతలు అమాయకులపై పెత్తనం చేస్తున్నారు. చివరకు జీవనాధారమైన సాగు భూములు లాక్కుని రౌడీల్లా ప్రవర్తిస్తున్నారు. అధికారం అండతో ఆన్‌లైన్‌లోనూ తమ పేర్లు ఎక్కించుకుంటున్నారు.

రాత్రికి రాత్రే మొక్కలు నాటారు

రామగిరి మండలం పెనుబోలు గ్రామంలోని సర్వేనంబర్ 361–ఏ, 361–1లోని 3.75 ఎకరాల భూమికి తేజస్విని పేరుమీద (డీఏఆర్‌డీ 449–70)డీ పట్టా ఉంది. దీంతో తేజస్విని భర్త సాయంతో ఆ పొలంలో వరి, వేరుశనగతోపాటు ఇతర పంటలు సాగుచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. అయితే జాతీయ రహదారికి కూతవేటు దూరంలోనే ఉన్న వీరి పొలంపై అదే గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి, పాపిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, హరినాథ్‌రెడ్డి కన్ను పడింది. అదునుకోసం వేచి చూపిన వారు... కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పొలాన్ని ఆక్రమించారు. రాత్రికి రాత్రే పొలంలో మామిడిచెట్లను నాటించారు. అంతేకాకుండా మండల కార్యాలయంలోని అధికారుల చేతులు తడిపి ఆన్‌లైన్‌లో పేర్లు మార్చేశారు.



తేజస్విని పేరుమీద ఉన్న పట్టాదారు పాసుపుస్తకం

ప్రస్తుతం తేజస్విని పొలం ఆన్‌లైన్‌లో రామకృష్ణారెడ్డి తల్లి రామాంజినమ్మ పేరు మీద చూపుతోంది. ఇదేంటని ప్రశ్నిస్తే..ఇష్టమున్నచోట చెప్పుపో అంటూ బెదిరించారని తేజస్విని వాపోతోంది. వీరి దౌర్జన్యం గురించి ఫిర్యాదు చేద్దామని వెళితే రామగిరి పోలీసులు భూఆక్రమణదారులకే మద్దతుగా మాట్లాడుతున్నారని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భూఆక్రమణ నుంచి తన పొలాన్ని రక్షించి తమకు జీవనాధారం చూపాలని కోరుతున్నారు.

తెరుచుకున్న చెర్లోపల్లి అంగన్‌వాడీ తలుపులు

సాక్షి ఎఫెక్ట్..



లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీడీపీఓ కవితాదేవి


రామగిరి: మండలంలోని చెర్లోపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం తలుపులు మంగళవారం ఎట్టకేలకు తెరుచుకున్నాయి. టీడీపీ నేతలు అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేయడంతో లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 17న 'టీడీపీ నేతల బరితెగింపు' శీర్షికన 'సాక్షి'లో కథనం వెలువడిన విషయం తెలిసిందే. స్పందించిన సీడీపీఓ కవితాదేవి, సూపర్‌వైజర్ గంగాభవానీ మంగళశారం చెర్లోపల్లిలో పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రం తలుపులు తెరిపించి ఆయా లక్ష్మీనరసమ్మ ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేయించారు. కాగా, కేంద్రంలో టీచర్ పోస్టు ఖాళీగా ఉండడంతో రోజూ అంగన్‌వాడీ కేంద్రం తలపులు తీసి పౌష్టికాహారాన్ని పంపిణీ చేయాలని ఆయాను ఆదేశించారు. కొన్ని నెలలుగా రాజకీయ గ్రహణంతో మూత పడిన అంగన్‌వాడీ కేంద్రం మంగళవారం తెరచుకోవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పైడేటి రమణ కన్నుమూత



బెంగళూరులోని ఆస్పత్రిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఉషశ్రీచరణ్

పరిగి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విశేష సేవలందించిన ఆ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి, పెనుకొండ మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ పైడేటి డీవీ రమణ(55) ఇక లేరు. వారం రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం కన్నుమూశారు. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆయన వైఎస్సార్‌సీపీలో చేరారు. తనదైన సేవలతో పాటూ వ్యక్తిగత ఇమేజ్ కారణంగా పెనుకొండ నియోజకవర్గంలో అన్ని వర్గాల వారికి ఆయన సుపరిచితులయ్యారు. వారం రోజుల క్రితం జ్వరంతో బాధపడుతున్న ఆయనను తొలుత హిందూపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కుటుంబసభ్యులు చేర్పించారు. పరిస్థితి విషమిస్తుండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం వరకూ ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నా... ఆ తర్వాత రెండు సార్లు గుండెపోటుకు గురయ్యారు. ఈ క్రమంలో జ్వర తీవ్రత మెదడుకు చేరడంతో ఆరోగ్య పరిస్థితి విషమించి మధ్యాహ్నం మృతి చెందారు. విషయం తెలియగానే జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు కేవీ ఉషశ్రీచరణ్ దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఆగమేఘాలపై బెంగళూరులోని ఎంఎస్ రామయ్య ఆస్పత్రికి చేరుకుని రమణ మృతదేహాన్ని పరిశీలించి, నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను, బంధువులను పరామర్శించారు. కాగా, రమణ మృతిపై మండల ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.



డీవీ రమణ (ఫైల్)